క్లుప్తంగా

నీటి సంఘం ఎన్నికలకు 13,713 మంది ఓటర్లు

చాపాడు : మండల పరిధిలో త్వరలో జరుగనున్న నీటి సంఘం ఎన్నికలకు 13,713 మంది ఓటర్లుగా నమోదయ్యారని డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. వీరిలో పురుషులు 9,688 మంది ఉండగా, మహిళలు 4,025 మంది ఉన్నారన్నారు. మండల పరిధిలో 10 నీటి సంఘాలు ఉండగా వీటిలో 7 నీటి సంఘాలకు చాపాడు మండలంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఒక టీసీ ప్రొద్దుటూరు, మరొక టీసీ దువ్వూరు, ఇంకో టీసీ ఖాజీపేట మండల పరిధిలో ఎన్నికల నిర్వహించటం జరుగుతుందని డీటీ తెలియజేశారు.

పొలం పరిశీలన

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామంలో ముదిరెడ్డి సాంబశివారెడ్డి పొలాన్ని మంగళవారం జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ పరిశీలించారు. ఆ రైతు తన పొలాన్ని వ్యవసాయేతర పొలంగా మార్చాలని తహసీల్దారుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆర్డీఓ సాయిశ్రీతోపాటు తహసీల్దార్ వెంకటేశ్వర్లు అందుకు సంబంధించిన పొలాన్ని, డాక్యుమెంట్లను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ఆర్డీఓ వెళ్లారు. అక్కడ రికార్డు గదిని పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ మనోహర్‌రెడ్డి, ఆర్ఐ హుస్సేన్ రెడ్డి, వీఆర్ఓలు అశోక్, రాజశేఖర్‌రెడ్డి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్లాంట్ పరిశీలన



నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక రామేశ్వరంలోని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ట్రీట్ మెంట్ ప్లాంట్‌లో జరుగుతున్న నీటి శుద్ధి ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. మున్సిపాలిటీలోని ప్రజలందరికీ శుద్ధమైన నీటిని అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్లు కె.సురేంద్రనాథ్ రెడ్డి, టి.వీరకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ల కోసం శిక్షణ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని నిరుద్యోగులకు న్యాక్ సెంటర్ ద్వారా అసిస్టెంట్ సర్వేయర్‌ల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని న్యాక్ సెంటర్ అధికారి రాకేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఇంటర్మీడియట్, ఐటీఐ డిప్లమా చదువుకున్న అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. అభ్యర్థులు 6వ తేదీలోపు హాజరుకావాలన్నారు. 120 రోజుల పాటు సాగే ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌లను ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9985142155 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ముద్దనూరు : మండలంలో రెవెన్యూ సదస్సులు 5వ తేదీ నుంచి వచ్చే ఏడాది 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఈనెల 5వ తేదీన కొసినేపల్లెలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌కు నివాళి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో భారతీయ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. హాకీ శిక్షకుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అన్ని రంగాల్లో దివ్యాంగులు రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి



దివ్యాంగుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారెడ్డి

ప్రొద్దుటూరు : దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని గోపవరం పంచాయతీలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికి కానీ.. సంకల్పానికి కాదని, ఆత్మ స్థైర్యంతో తాము ఎవరికి తీసిపోమని అన్ని రంగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారన్నారు. భవిత కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దివ్యాంగుల వికాసం కోసం పిల్లలను భవిత కేంద్రానికి తల్లిదండ్రులు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు వారు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు గడియారం వెంకట శేషశర్మ, ఐఈఆర్పీ సంగీత, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగండి

పోరుమామిళ్ల : దివ్యాంగ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, తమలో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటాలని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో దివ్యాంగులు తమ ప్రతిభ, సామర్థ్యాలతో ప్రపంచాన్ని అబ్బుర పరచారని, బలహీనులమనే భావన విడనాడాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంఈఓలు కాశయ్య, బాలఅంకిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఉన్నత చదువులు చదవాలని, మంచి అవకాశాలు ఉన్నాయని, ఇతరులకన్నా తక్కువ మార్కులు వచ్చినా రాణిస్తారన్నారు. స్కాలర్‌షిప్పులు, అలవెన్సుల గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించి , వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ భవిత కేంద్రానికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో భవిత కేంద్ర నిర్వాహకులు (ఐఈఆర్పీఎస్) సునీల్‌బాబు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసావాలు సాధ్యమని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ రవిబాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణుల నమోదు, కష్టతరమైన వానిపి గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిల్కారి సేవలు, వారు చేయాల్సిన ఐదు ఇండికేటర్లపై ఆశా వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్సీడీ సీడీ 3.0, క్యాన్సర్ స్క్రీనింగ్, స్కూల్ హెల్త్ పోగ్రాం , అభ ఐడీ వంటి వాటిపై రివ్యూ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సాంబశివారెడ్డి, సూపర్‌వైజర్‌లు పుష్పరాజు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో బాలికల ప్రతిభ



రూ.10 వేలు నగదును కె.అశ్వనికి అందిస్తున్న ప్రిన్సిపాల్ తులశమ్మ

రాజుపాళెం : పులివెందులలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ క్రీడా పోటీల్లో వెల్లాలలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభకనబరిచినట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ మంగళవారం తెలిపారు. పరుగు పోటీలు, హైజంప్‌లో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. ఈ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కె.అశ్విని 400, 800, 1500 మీటర్ల పరుగు పోటీలో మొదటి స్థానం, జూనియర్ విభాగంలో 7వ తరగతి చదువుతున్న ఎస్.నాగవేణి హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. కె.అశ్వనికి రూ.10వేలు నగదు బహుమతి అందించినట్లు తెలిపారు. అనంతరం క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ ఏసుకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో ఆరోగ్యం



వ్యాయామ విద్యార్థులతో వైవీయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ రఘుబాబు, కళాశాల అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నిత్యం క్రీడలు ఆడటం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని యోగివేమన విశ్వ విద్యాలయం సీడీసీ డీన్ ప్రొఫెసర్ బి.రఘుబాబు తెలిపారు. మండలంలోని లింగాపురం వద్ద ఉన్న రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాలలో మంగళవారం కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన ఎంపీఈడీ విద్యార్థి షాకీర్ బాషాను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా కళాశాలలో అంతర్గత పోటీలను నిర్వహించడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు. అనంతరం ఎంపీఈడీ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల మధ్య జరిగిన కబడ్డీ పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ బి.రామసుబ్బారెడ్డి, అంతర్గత పోటీ విద్యార్థుల సెక్రటరీ ప్రవీణ్, కబడ్డీ ఆచార్యులు డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి, డీపీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ వ్యాయామ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని అవకాశాలను వినియోగించుకోవాలి

అట్లూరు : దివ్యాంగులు అన్ని అవకాశాలను వినియోగించుకుని జీవితంలో రాణించాలని బద్వేలు మండల విద్యాశాఖాధికారి ఓ.ప్రమీల, బద్వేలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డిలు తెలిపారు. మంగళవారం బద్వేలు పట్టణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎస్.మహబూబ్‌పీరా మాట్లాడుతూ ప్రతి వారం క్రమం తప్పక ఫిజియోథెరిపిని వినియోగించుకుని జీవితంలో రాణించాలన్నారు. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులకు, పిల్లలకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్లు బి.వెంకటసుబ్బయ్య, ఎం.వి.సుభద్రమ్మ, రిసోర్స్ టీచర్లు పి.రామచంద్రారెడ్డి, హెచ్.లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో పొలం పిలుస్తోంది

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, వివిధ పంటలలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. మండలంలో 40.6 మిల్లీమీటర్లు అధిక వర్షపాతం నమోదైందన్నారు. అధిక వర్షపాతం నమోదు కావడంతో 15 రోజుల తర్వాత కోతకు వచ్చే పంటకు నష్టం కలగలేదని, కోతకు సిద్ధంగా ఉన్న పంటకు మాత్రమే నష్టం జరిగిందని, 30 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా కారణంగా అధికారులకు పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వీఏఏ బి.శివ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి తరలిరండి

మైదుకూరు : దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వార్షికోత్సవం ఈనెల 6వ తేదీ కడపలో నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి నియోజకవర్గంలోని దివ్యాంగులందరూ హాజరు కావాలని సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌బీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటై 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కడపలోని వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన దివ్యాంగలతో వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై చర్చిస్తామని, ఇప్పటి వరకు సాధించిన విజయాలను వివరిస్తామని తెలిపారు.

సెలవులు నిరాకరించడం సరికాదు

పోరుమామిళ్ల : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ దృష్ట్యా ఉపాధ్యాయులు సెలవులు పెట్టుకోవడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేయడం సరికాదంటూ ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాశాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మంచి కార్యక్రమమని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి మా వంతు కృషి ఉంటుందన్నారు. అయితే శనివారం సమావేశం పూర్తయ్యే వరకు ఉపాధ్యాయులు సెలవులు పెట్టుకోవడానికి వీల్లేదంటూ డీఈఓ ఆంక్షలు జారీ చేయడం సరికాదన్నారు. డీఈఓ ఆదేశాలతో ఎంఈఓలు సెలువులు నిరాకరించడం తగదన్నారు. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యం, కుటుంబపనులు ఇతర సమస్యలున్న వారు క్యాజువల్ లీవ్ పెట్టరాదనడం సమంజసం కాదన్నారు. సమావేశంలో ఎస్టీయూ నేతలు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని ఖాదరబాద్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని మంగళవారం ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణిలకు మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాదరబాద్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 90 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. గతంలో ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారని, వీరిలో ఒకరు జూన్‌లో రిటైర్ అయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఒకరిని డిప్యూటేషన్‌పై నియమించారన్నారు. వెంటనే మరో ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే కార్యదర్శి రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, ముక్తియార్ పాల్గొన్నారు.

వరి నూర్పిళ్లను తాత్కాలికంగా వాయిదా వేసుకోండి

చాపాడు : ఫెంగల్ తుపాను వర్షాలు మరి కొన్ని రోజులు కురిసే అవకాశం ఉండటంతో వరి నూర్పిళ్లను రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. మండల పరిధిలోని నెర్రవాడ, బద్రిపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఎవరైనా నూర్పిళ్లు చేసి ఉంటే ధాన్యం వర్షపు నీటిలో తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. అధిక వర్షాలు పడితే నీటి నిలువ లేకుండా నీరు బయటికి వెళ్లిపోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. తుఫాను పోయిన తర్వాత పైర్లకు తెగుళ్ల సోకకుండా ట్రైసైక్లోజోల్ 2 గ్రాములు లీటరు నీటి లో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

డ్రిప్ స్ప్రింక్లర్స్ కోసం దరఖాస్తు చేసుకోండి



మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మైదుకూరు : డ్రిప్ స్ప్రింక్లర్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వేసిన పంటలకు ఈ-పంట ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. జొన్న, మినుము, మొక్క జొన్న పంటలకు ఫసల్ బీమా ద్వారా ప్రీమియం డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించాలని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులు మల్చింగ్ షీట్లు, డ్రిప్ స్ప్రింకర్లకు అప్లై చేసుకోవాలని సూచించారు. ఆయిల్ ఫాం సాగు గురించి ఆ విభాగం అధికారి కొండారెడ్డి రైతులకు వివరించారు. ఆయిల్ ఫాం సాగు తర్వాత పంటను కంపెనీ వారు మాత్రమే కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లిస్తారని చెప్పారు. అనంతరం రైతులు సాగు చేసిన మినుము, తదితర పంటలను పరిశీలించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగయ్య

ప్రొద్దుటూరు రూరల్ : ఈనెల 8వ తేదీన జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికలను విజయవంతం చేయాలని తహసీల్దార్ గంగయ్య పేర్కొన్నారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం సాయంత్రం పెద్దశెట్టిపల్లె, ఉప్పరపల్లె, బొల్లవరం, ప్రొద్దుటూరు సాగునీటి సంఘాలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఓ, ఏపీఓలకు కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల నామినేషన్ మొదలుకుని డిక్లరేషన్ ఫారం వరకు అన్ని రకాల ఫారాలను ఎలా పూరించాలో ఆయన వివరించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు పీఓలు, ఏపీఓలు కృషి చేయాలని తెలిపారు. ఏకగ్రీవం చేయడం వల్ల ఆ సాగునీటి సంఘాలకు ప్రభుత్వం నుండి ప్రోత్సాహక నిధులు వస్తాయని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేసుకోవచ్చన్నారు. పోటీలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు సమానంగా ఓట్లు వచ్చినప్పుడు ఆ వ్యక్తులకు డిప్ ద్వారా ఎన్నికను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయులు రెడ్డి, మైలవరం కాలువ ఏఈ లలితా రెడ్డి, రూరల్ సీడీపీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ఖాదరబాద్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఖాదరబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీతాఫలం, జామాయిల్, నేరేడు తదితర 50 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి సంరక్షించి భావితరాల మన వారసులకు బాసటగా నిలవాలని తెలిపారు. పదో తరగతి 2024–25వ సంవత్సరంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి సాధు గోపాలకృష్ణ రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీధర్ శర్మ రూ.3వేలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలసూర్యారావు, కార్యదర్శి శ్రీధర్ శర్మ, వైస్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వరరెడ్డి, గుర్రం రామకృష్ణ, కొవ్వూరు రవికుమార్ రెడ్డి, పాఠశాల స్థల దాత వెంకటేశ్వర్లు, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తుకారం తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి



డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన బోర్డులను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అట్లూరు : బద్వేలు పట్టణ సుందరీకరణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. తాత్కాలిక ఆక్రమిత నిర్మాణాలను, డ్రైనేజీలపై ఏర్పాటు చేసుకున్న బోర్డులు, వ్యాపార ప్రకటన బోర్డులను తక్షణమే తొలగించాలన్నారు. స్వచ్ఛందంగా తొలగించాలని ఇప్పటికే పలుమార్లు తెలియజేశామని, అయినా కూడా కొంత మంది స్పందించడం లేదని, అటువంటి వాటిని పురపాలక సంఘం వారే తొలగించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఎలాంటి కట్టడాలు చేపట్టరాదన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా కేటాయించిన చెత్తసేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలన్నారు. మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సతీష్, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లెలో పొలం పిలుస్తోంది



బ్రాహ్మణపల్లెలో వరినాట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండలంలోని బ్రాహ్మణపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలోని బ్రాహ్మణపల్లె, అడుసువారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల సాగు తదితర అంశాలపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అనంతరం వరిపంటను సాగు చేస్తున్న పొలాల్లోకి వెళ్ళి నాట్లు వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి పంట నమోదు చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరిపంటకు సంబంధించి బీమా చెల్లించాలని, ఇతర పంటలకు ఈ నెల 15వ తేదీలోపు బీమా చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది బాదుల్లా, ఓబయ్య, విజయ్, రైతులు పాల్గొన్నారు.

రోగులకు రుచికరమైన ఆహారం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డైట్ చార్జీలు రెట్టింపు
- అప్పటి నుంచి రోగులకు నాణ్యమైన భోజనం



ఆహారాన్ని తనిఖీ చేస్తున్న డైటీషియన్ చిరంజీవి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పెట్టే ఆహారం రుచికరంగా, నాణ్యతగా ఉందంటే అందుకు కారణం గత ప్రభుత్వ హయాంలో డైట్ చార్జీలు పెంచడమే. అప్పటి వరకు ఏ ప్రభుత్వాలు రోగుల భోజనం నాణ్యతపై పెద్దగా దృష్టి సారించలేదు. పెట్టిందే తినండి అన్న రీతిలో వ్యవహరించేవి. అయితే రోగులకు మెరుగైన వైద్యంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం ఇస్తేనే త్వరగా కోలుకుంటారని నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. గతంలో ఇస్తున్న చార్జీలతో నాణ్యమైన భోజనం పెట్టడం సాధ్యం కాదని వాటి ధరలను రెట్టింపు చేశారు. గతంలో సాధారణ రోగులకు రోజుకు రూ. 40 ఇస్తుండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ. 80కి పెంచింది. అలాగే క్షయ రోగులకు రూ.58 నుంచి రూ.80, వైద్యులకు అందించే భోజనం చార్జీలను రూ.80 నుంచి రూ.100కు పెంచారు. ప్రభుత్వం సూచించిన మెనూలోని వంటకాలను నాణ్యతతో, రుచికరంగా చేస్తుండటంతో ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని రోగులు సంతృప్తిగా భోజనం చేస్తున్నారు.

ప్రభుత్వం సూచించిన మెనూ..

డైట్ చార్జీలు రెట్టింపు చేయడంతో పాటు మెనూలో కూడా గత ప్రభుత్వం మార్పులు చేపట్టింది.

ఉదయం : జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి 8.30 మధ్య రోగులకు అల్పాహారం అందిస్తున్నారు. మూడు ఇడ్లీలు, 100 ఎంఎల్ సాంబారు, 150 ఎంఎల్ పాలు ఇస్తారు. అలాగే గర్భవతులు, బాలింతలకు నాలుగు ఇడ్లీలతో పాటు 150 ఎంఎల్ సాంబారు, 250 ఎంఎల్ పాలు ఇస్తున్నారు.

మధ్యాహ్నం : మధ్యాహ్నం సమయంలో 12 గంటల నుంచి 1 గంట మధ్యలో రోగులకు భోజనం అందిస్తున్నారు. 600 గ్రాముల అన్నం, 150 గ్రాముల పప్పు, 200 ఎంఎల్ సాంబారు, గుడ్డు, 100 ఎంఎల్ మజ్జిగ, అరటి పండు ఇస్తున్నారు. ఇందులో గర్భిణులు, బాలింతలకు అదనంగా తాళింపు ఇస్తారు.

సాయంత్రం : సాయంత్రం సమయంలో లేబర్ వార్డులోని గర్భిణులు, పోస్ట్ ఆపరేటివ్ వార్డులోని బాలింతలకు రెండు చిక్కీలు, 150 ఎంఎల్ పాలు ఇస్తారు. ఇక ఎన్టీఆర్ వైద్యసేవ కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగులకు మూడు బిస్కెట్లు, 150 ఎంఎల్ పాలు అందచేస్తారు.

రాత్రి : జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి 8 గంటల వరకు వార్డుల్లోని రోగులకు భోజనం సరఫరా చేస్తారు. అన్నం 450 గ్రాములు, పప్పు 150 గ్రాములు, సాంబారు 200 ఎంఎల్‌తో పాటు గుడ్డు ఇస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు వీటన్నింటినీ ఇస్తూ అదనంగా 200 ఎంఎల్ మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ విభాగం పేషెంట్లకు అదనంగా గుడ్డు ఇస్తారు.

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో

జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పెట్టే ఆహారంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో పాటు డైటీషియన్ చిరంజీవి ఆహారాన్ని మానిటరింగ్ చేస్తున్నారు.

భోజనం బాగుంది



ఆస్పత్రిలో పెట్టే భోజనం బాగుంది. కూరలు రుచికరంగా ఉండటమే కాకుండా నాణ్యతగా ఉన్నాయి. ఆస్పత్రికి వచ్చేటప్పుడు భోజనం బాగుంటుందో లేదో అనే అనుమానం ఉండేది. అడిగినంత భోజనం పెడుతున్నారు.

\- లక్ష్మీదేవి, కొండాపురం మండలం